


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శనివారం | 12 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08




# పకడ్బందీగా నిమజ్జన ప్రక్రియ

**వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్.పి**

**నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందు లు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి. డి.జానకి అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండును, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను శుక్రవారం కలె క్టర్, ఎస్.పి సంయుక్తంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ పల్లి పంచవటి పాఠశాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ చెరువు, శ్రీనివాస్ కాలనీ చెరువు, అప్పన్నపల్లి చెరువు, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించి, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అప్పనపల్లి చెరువు వద్ద ఎక్కువ వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడ రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాలను నిమజ్జనం చేసేందు కు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో బేబీ పాండ్లను ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నీరు ఉండేలా చూడాలని ..మిగతా 2లో




# కౌన్సిలర్లు వద్దంటేనే.. మీడియాకు నో ఎంట్రీ!



**ఇస్నాపూర్ కౌన్సిల్ లోగుట్టు?**

**అంతా రహస్యం ?**

**లీక్ భయమా.. సీక్రెట్ కౌన్సిల్**

**అక్షిత తెలుగు దినపత్రిక వార్తకు వివరణ ఇచ్చిన ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్**

**కౌన్సిల్ సమావేశానికి మీడియాకు నో ఎంట్రీపై విమర్శలు**

**ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది?**

**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి :** అంతా లోగుట్టు. గుట్టు చప్పుడుగా కౌన్సిల్ భేటీ... అంతా రహస్యం. ప్రజల సమస్యలపై చర్చ జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మీడియా ప్రతినిధులను అనుమతించక పోవడం ఇప్పుడు చర్చనీ యాంశంగా ..మిగతా 2లో

# ట్రాఫిక్ సమస్యలు తలెత్తొద్దు

**వినాయకులను నిమజ్జనానికి తీసుకరావాలి**

**ట్రాఫిక్ సమస్య తలేత్తకుండా ఉండేందుకు సహకరించండి**

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్, అక్షిత బ్యూరో:** నగరంలోని కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం, చిన్న వడ్డేపల్లి, ఉర్సు చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్, వరంగల్ హన్మకొండ జిల్లా కలెక్టర్లు గణపతి విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బ్రహ్మోస్‌తో యువతకు ఉపాధి

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



**దేవరకద్ర, అక్షిత న్యూస్ :** బ్రహ్మోస్ ఏర్పాటుతో యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అసెంబ్లీలో మాట్లాడిన దేవరకద్ర ఎమ్మెల్యే మధు సూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షిస్తూ భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లను తీసుకురావడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు, రాష్ట్ర యువత భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలనే లక్ష్యంతో 70 వేల కోట్లతో డేటా సెంటర్, భారీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో హైదరాబాద్ టు బెంగళూరు జాతీయ రహదారి చీఎ-44 సుమారు 68 కిలోమీటర్ల మేర ..మిగతా 2లో

## పకడ్బందీగా నిమజ్జన ప్రక్రియ



**మొదటి పేజీ తరువాయి...**

కలెక్టర్ సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుద్ధ్య సౌకర్యాలు, తాగునీరు, ప్రవేశం--నిష్క్రమణ మార్గాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లే మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, దాని ప్రక్కనే ఉన్న శిల్పారామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనులు, వాటి పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు యాది రెడ్డి, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఠాణాలోనే నిప్పంటించుకున్న యువకుడు

### మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఊహించని పరిణామం

### మంటలు ఆర్పే క్రమంలో రైటర్ ప్రవీణ్‌కు గాయాలు

### ఎంజీఎంకు క్షతగాత్రుల తరలింపు



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. కట్ల హర్షిత్ అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఠాణాలోకి దూసుకొచ్చి పోలీసుల ముందే నిప్పంటించుకున్నాడు. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది.

అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో హర్షిత్‌తో పాటు స్టేషన్ రైటర్ ప్రవీణ్‌కు గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రులను హుటాహుటిన ఆటోలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**కుటుంబ కలహాలతోనే..?**

కొంతకాలంగా హర్షిత్, ఆయన భార్య మధ్య కుటుంబ వివాదం కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తీవ్ర మానసిక క్షోభకు గురైన హర్షిత్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. తన బిడ్డను తనకు దూరం చేశారంటూ ఆయన కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది.

అత్త, భార్య వేధింపుల కారణంగానే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు హర్షిత్ వెల్లడించినట్లు సమాచారం. అయితే ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, వివాదానికి సంబంధించిన ఇతర వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉందన్నారు.

# కౌన్సిలర్లు వద్దంటేనే.. మీడియాకు నో ఎంట్రీ !

**మొదటి పేజీ తరువాయి...**

మారింది. కౌన్సిల్ సమావేశాల ద్వారా ప్రజలకు పాలనపై సమాచారం అందాల్సి ఉండగా.. మీడియాను సమావేశానికి దూరంగా ఉంచడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లక్డారం వార్డు కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి మీడియాను అనుమతించకపోవడంపై వచ్చిన వార్తలకు మున్సిపల్ కమిషనర్ వివరణ ఇచ్చారు. సమావేశ మందిరం పరిమితంగా ఉండటం, మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో రావడం వంటి కారణాలతో సమావేశ మందిరంలోకి మీడియాను అనుమతించలేదని కమిషనర్ తన వివరణలో పేర్కొన్నారు.

**హాల్ చిన్నదైతే.. ప్రత్యామ్నాయం చూపించలేరా?**

సమావేశ మందిరం చిన్నదిగా ఉందన్న కారణం చూపి మీడియాను పూర్తిగా బయట ఉంచడం ఎంత వరకు సమంజసం అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే కౌన్సిల్ సమావేశాలను ప్రజల తరఫున ప్రశ్నించే మీడియా ప్రతినిధులకు కనీసం తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా? హాల్‌లో స్థలం సరిపోకపోతే మీడియా కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడం, పరిమిత సంఖ్యలో ప్రతినిధులను అనుమతించడం లేదా సమావేశాన్ని మీడియాకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం వంటి మార్గాలు లేవా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కౌన్సిలర్ల సమావేశానికి మీడియా ఎందుకు వద్దు..?**

ప్రజల ఓట్లతో ఎన్నికైన కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై చర్చించే సమావేశమై కౌన్సిల్ సమావేశం.అలాంటి సమావేశంలో ఏం చర్చించారు? ఏ నిర్ణయాలు తీసుకున్నారు? ప్రజల సమస్యలపై ఎవరు మాట్లాడారు? అనే విషయాలు తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది.

అయితే మీడియాను సమావేశానికి రానివ్వకుండా చేస్తే.. కౌన్సిల్‌లో జరిగే చర్చలు ప్రజలకు ఎలా తెలుస్తాయన్నదే ప్రధాన ప్రశ్న.'పారదర్శక పాలన' అంటూనే.. సమావేశానికి మీడియాకు నో ఎంట్రీ ఇవ్వడం విరుద్ధంగా కనిపించడం లేదా? అని పలువురు



ప్రశ్నిస్తున్నారు.

**వివరణ ఇచ్చారు.. కానీ ప్రశ్నలు మాత్రం మిగిలే ఉన్నాయి!**

కమిషనర్ ఇచ్చిన వివరణలో సమావేశ మందిరం పరిమితి, మీడియా ప్రతినిధుల సంఖ్య వంటి అంశాలను ప్రస్తావించినప్పటికీ.. మీడియాను పూర్తిగా సమావేశానికి దూరంగా ఉంచాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనే ప్రశ్నకు స్పష్టత రావాల్సి ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల వివరణ తమ వైఖరిని సమర్థించుకునే ప్రయత్నంగా ఉందని విమర్శకులు అంటున్నారు. మరోవైపు కౌన్సిల్ సమావేశాలను ప్రజలకు మరింత పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల సమస్యలపై చర్చించే చోటే.. ప్రజల గొంతుకకు తలుపులు మూస్తారా?**

కౌన్సిల్ సమావేశం అనేది ఎవరి వ్యక్తిగత సమావేశం కాదని, అది ప్రజల కోసం నిర్వహించే ప్రజా పరిపాలనా సమావేశమని గుర్తించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మీడియాను అనుమతించకపోవడం వెనుక కేవలం స్థలాభావమే కారణమా? లేక సమావేశంలో జరిగే చర్చలు బయటకు రాకూడదనే ఉద్దేశమా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఇచ్చిన వివరణతో వివాదం ముగిసే బదులు.. మీడియాకు సమావేశాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించేందుకు ఇకనైనా స్పష్టమైన విధానం ప్రకటిస్తారా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ప్రజా పాలనలో పారదర్శకతే ప్రధానమైతే.. ప్రజల గొంతుకైన మీడియాకు కౌన్సిల్ తలుపులు ఎప్పటికీ మూసి ఉండకూడదనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి.

**కౌన్సిలర్లే చెప్పారు మీడియాకు సమావేశ మందిరములో అనుమతించవద్దని...**
**"కమిషనర్ వెంకట కిషన్ స్పష్టీకరణ"**

మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలోకి మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ స్పష్టత ఇచ్చారు. సమావేశ మందిరంలోకి మీడియాను అనుమతించకూడదని కౌన్సిలర్లే సూచించారని ఆయన వివరించినట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై చర్చించే కౌన్సిల్ సమావేశాలకు మీడియాను దూరంగా ఉంచాలని కౌన్సిలర్లే కోరడం ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. ప్రజల తరఫున ప్రశ్నించే మీడియాకు తలుపులు మూసి.. ప్రజా ప్రతినిధుల సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసం? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.సమావేశ మందిరంలో స్థలాభావం వంటి కారణాలు ఉన్నప్పటికీ, మీడియాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సింది పోయి పూర్తిగా అనుమతి నిరాకరించడం సరైన విధానమేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.ప్రజా పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన సమయంలో మీడియాకు 'నో ఎంట్రీ' చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

**కమిషనర్ వివరణలో అవాస్తవాలు..!**

అయితే మున్సిపల్ సర్వసభ సమావేశానికి సంబంధించి కమిషనర్ ఇచ్చిన వివరణపై కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమావేశం ముగిసిన అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, చైర్‌పర్సన్ మీడియాకు ఎలాంటి వివరణ ఇవ్వలేరు. అయితే కమిషనర్ ఇచ్చిన వివరణలో సమావేశం అనంతరం మీడియాకు వివరాలు తెలిపినట్లుగా పేర్కొనడం వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశం ముగిసిన తర్వాత మీడియాకు వివరణ ఇవ్వకపోతే.. ఇచ్చిన వివరణలో ఆ విషయాన్ని ఎందుకు పేర్కొన్నారు? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు మరింత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు వర్గాలు పేర్కొంటున్నాయి. వాస్తవం ఏమిటో అధికారులు బహిరంగంగా వెల్లడిస్తేనే ఈ వివాదానికి తెరపడే అవకాశం ఉంది.

# బ్రహ్మోస్‌తో యువతకు ఉపాధి

**మొదటి పేజీ తరువాయి...**

అనుసంధానమై ఉందని తెలిపారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా నియోజకవర్గం సమీపంలోనే ఉందని, జాతీయ రహదారి, ప్రభుత్వ భూముల లభ్యత వంటి అనుకూలతలు ఉన్నందున ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని ముఖ్యమంత్రి ని, పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు, తమరి ( శాసనసభ) ద్వారా మరోసారి మంత్రి దృష్టికి తీసుకెళ్తున్నామని తెలియజేశారు.

దేవరకద్ర నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉన్నందున ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంతో పాటు స్థానిక యువతకు



భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 415 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారని అన్నారు, ఈ ప్రాజెక్టు నియోజకవర్గానికి రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దేవరకద్ర నియోజకవర్గం రెండు జాతీయ రహదారులకు అనుసంధానం ఉండటంతో పాటు మూడు రాష్ట్రాలకు అనుకూలమైన భౌగోళిక ప్రాంతంలో నియోజకవర్గం ఉందని, కావున డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు, ఇక్కడ డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. తెలంగాణను ఐటీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే ప్రభుత్వ ప్రయత్నాలకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం పెంచాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, రద్దీగా ఉండే రహదారులు, మార్కెట్ ప్రాంతాలు కలిగి ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, నో–పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదలను నియంత్రించాలని, పాదచారులు మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. వినాయక చవితి మరియు నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. వన్‌టౌన్ పరిధిలో ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించాలని, మండప నిర్వాహకులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక మండపాలు, ఊరేగింపులు మరియు నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, శబ్ద పరిమితులు, రహదారుల ఆక్రమణ వంటి అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

# వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల రాస్తా రోకో

## న్యాయం కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

## కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ ప్రధాన రహదారిపై విద్యార్థుల నిరసనతో ట్రాఫిక్ స్తంభించడంతో ఎంజీఎం ఆస్పత్రికి చేరుకోవాల్సిన అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. అత్యవసర వైద్య సేవలకు వెళ్లే అంబులెన్సులకు దారి లేకపోవడంతో పరిస్థితిపై ఆందోళన. విద్యార్థులకు సర్ది చెప్పుతున్న మట్టేవాడ పోలీసులు..

వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిరసనకు దిగారు. కళాశాల ఎదురుగా ప్రధాన రోడ్డుపైకి వచ్చిన విద్యార్థులు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై



బైఠాయించి నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం వినాయక చవితి నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా వినాయక విగ్రహాల విక్రయాలు కొనసాగుతుండటంతో ఇప్పటికే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడు తున్నాయి. దీనికి తోడు పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసనతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. విద్యార్థుల ఆందోళన కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు.

# మార్కెట్ ధర ప్రకారమే పరిహారం ఇవ్వాలి

## దేవాదుల భూనిర్వాసిత రైతుల డిమాండ్

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** దేవాదుల ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి మండలం గొల్ల బుద్ధారం గ్రామంలో నిర్మిస్తున్న పంప్ హౌస్ వల్ల భూములు కోల్పోతున్న రైతులు ప్రస్తుత ఉన్న మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వం తమ భూములకు ధర నిర్ణయించాలని ఆర్డీవో హరికృష్ణ ను కోరారు..

శుక్రవారం గొల్ల బుద్ధారం గ్రామంలో ఆర్డీవో హరికృష్ణ పర్యటించారు..ఈ సందర్భంగా గ్రామంలో భూ నిర్వాసితుల రైతులతో మాట్లాడి వారి సమస్యలను, అభ్యంతరాలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.. దేవాదుల ప్రాజెక్టులో భూములను



కోల్పోతున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం తమకు వద్దని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రేటు నిర్ణయించాలని లేదంటే తమ భూములను ఇచ్చే ప్రసక్తి లేదని తెలియజేశారు.. రైతుల సమస్యలను విన్న ఆర్డీఓ హరికృష్ణ వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు..ఈ కార్యక్రమంలో గొల్లబుద్ధారం సర్పంచ్ సుంకరి కిరణ్ కుమార్ , లంబాడితండా సర్పంచ్ జయపాల్, భూ నిర్వాసితులు పాల్గొన్నారు..



# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన వాకిటి అనంతరెడ్డి



**వలిగొండ/అక్షిత న్యూస్:** వలిగొండ మండల సీనియర్ రిపోర్టర్ ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి ఆలకుంట్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ డైరెక్టర్ కల్కూరి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గంజి అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు ఉక్కుర్తి పద్మ నరసింహ, నిమ్మల వెంకటయ్య, పోలేపల్లి ప్రభాకర్, మారబోయిన మత్స్యగిరి, గంగ దారి అశోక్,ఉకుర్తి శీను, బోదాసు దుర్గయ్య, పిట్టల వెంకన్న, ఆలకుంట్ల రాములు, బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంను అధికారికంగా నిర్వహించాలి

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి




**మానకొండూర్ అక్షిత న్యూస్:** తెలంగాణ ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు సాగిన చారిత్రక పోరాటం, తెలంగాణకు అసలైన స్వాతంత్రం లభించిన సెప్టెంబర్ 17 ను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించే పరిస్థితుల్లో లేదని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన కాంగ్రెస్ సర్కార్, ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేయడం మానుకొని, అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాన కొండూరు మండల కేంద్రంలో జరిగిన ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. భారతదేశ సమైక్యత కోసం ఉక్కు సంకల్పంతో కృషి చేసిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన చర్యల ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తు చేశారు. తెలంగాణ విముక్తి కోసం రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వేలాది మంది వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం' కాకుండా అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను మరుగునపరిచే ప్రయత్నాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, మానకొండూరు మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, సెన్సార్ ఫిలిం బోర్డ్ మెంబర్ రాపాక ప్రవీణ్, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, బొగ్గుల రమేష్, బూట్ల శ్రీనివాస్, దూలం కిరణ్ గౌడ్, మియాపురం లక్ష్మణచారి, తదితరులు పాల్గొన్నారు.

9

# రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద

వరంగల్, అక్షిత బ్యూరో: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని జమాల్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

గ్రామంలో భూముల రీ-సర్వే జరుగుతున్నా తీరును పరిశీలించి ఏ మేరకు పూర్తయింది, అధికారులు చేపడుతున్న చర్యలు, సర్వేలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే సందర్భంగా భూముల వివరాలు, సరిహద్దులు,





హక్కులకు సంబంధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులు, భూ యజమానులకు అవసరమైన సమాచారం అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

సర్వే వివరాల నమోదు, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్ణీత గడువులోగా రీ-సర్వే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రీ-సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ రీ సర్వే పరిశీలన లో వరంగల్ ఆర్డీవో సుమ, ఎడి సర్వే మరియు భూ రికార్డు అధికారి శ్రీనివాసులు, పర్వతగిరి తహసిల్దార్ వెంకట స్వామి తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ--బీఆర్ఎస్ ఒక్కటేనని మరోసారి తేటతెల్లమైంది

### దళితుల పట్ల ఆ పార్టీలకు చిత్తశుద్ధి లేదు
### పీసీసీ అధికార ప్రతినిధి మేడి రవి చంద్ర




రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో: కేంద్రంలోని అధికార బీజేపీ, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో చెబుతూ వస్తోందని, తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ విషయాన్ని మరోసారి రుజువు చేస్తున్నాయని పీసీసీ అధికార ప్రతినిధి మేడి రవి చంద్ర అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పక్కదారి పట్టించేందుకు ఇరు పార్టీలు రాజకీయ విమర్శలకు దిగుతున్నాయని అన్నారు.

ముఖ్యంగా దళితుల సంక్షేమం, హక్కుల విషయంలో ఏ పార్టీకి ఎంత చిత్తశుద్ధి ఉందో ఆయా పార్టీల చర్యలే స్పష్టం చేస్తున్నాయని మేడి రవి చంద్ర పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే, దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీ వైఖరి ఏమిటో ప్రజలకు అర్థమవుతుందని అన్నారు.దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మేడి రవి చంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళా కూరపాటి శ్రీశైలం బోద్దుల శ్రీనివాస్ గంగరాజు బాలరాజు రాగుల జగన్ సబ్బని వేణు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండప నిర్వాహకులతో కల్లూరు ఏసిపి సమావేశం

### భక్తి శ్రద్ధలతో,సోదర భావంతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని సూచన





సత్తుపల్లి, అక్షిత న్యూస్: శుక్రవారం రోజు కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ గణేష్ నవరాత్రుల నిర్వాహకులతో సత్తుపల్లి లోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది.

గణేష్ నిర్వాహకులకు సైబర్ అవగాహన పోస్టర్ లు, మరియు పాయింట్ బుక్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో ఏసిపి మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ...పోలీసులకి సహకరించాలని ఏసిపి సూచించారు. రాబోయే గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సినభద్రతానిబంధనలు, పోలీసు శాఖ సూచనలు, ముందస్తు జాగ్రత్తలపైఅవగాహన కల్పించారు.ఈ సందర్భంగాగణేష్ మండపాల నిర్వాహకులు అందరూ పోలీసుశాఖ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల గణేష్ మండపాల నిర్వాహకులు, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి, మహిళా ఎస్ఐ కవిత, ఎస్ఐ లు అశోక్, ప్రదీప్ మరియు సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి ఫలించిన వేళ

### చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు హర్షణీయం...
### చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహారెడ్డి



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు కావటం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి ఫలితమేనని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ మాధవి దేవిని కలిశానని, చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ వినతి పత్రం అందజేశానని,ఆ సందర్భంగా అప్పటి జడ్జి మారుతి దేవి చౌటుప్పల్ కోర్టును సందర్శించారని, అదేవిధంగా కోర్టుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారని గుర్తు చేశారు. అనంతరం ప్రస్తుత జిల్లా జడ్జి జయరాజ్ కోర్టు స్థలాన్ని సందర్శించి, నూతన భవన నిర్మాణ ప్రపోజల్ ను హైకోర్టుకు పంపారని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి, చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు చేయించాలని విన్నవించానన్నారు. వెంటనే స్పందించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందుచూపుతో వ్యవహరించి చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు చేశారని తెలిపారు. దీంతో చౌటుప్పల్ మండల కేంద్రంలో కోర్టు నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. ఆదర్శ పాఠశాల, కళాశాల సమీపంలో సర్వే నెంబర్ 50లో ప్రభుత్వం ఇంతకుముందే కేటాయించిన 5ఎకరాల స్థలంలో నూతన భవనం నిర్మాణానికి బుధవారం మంజూరు చేస్తూ, జీవో జారీ చేసిందని తెలిపారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి న్యాయవాదుల తరపున ప్రత్యేకంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ కోలగాని శ్రీనివాస్



కరీంనగర్ అక్షిత బ్యూరో: నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ అన్నారు.

నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ ఆధ్వర్యంలో, అపోలో రీచ్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్యులు ముందుకు వచ్చి మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు మరియు సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజు రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాస్, పర్వతం మల్లేశం, అపోలో రీచ్ హాస్పిటల్ సిబ్బంది, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్స్ సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలి

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఖరీఫ్-రబీ ధాన్యం మిల్లింగ్ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని, ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరిస్తున్నా తమను ఆదుకోవాలని కోరుతూ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యాజమాన్యం శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు అన్నమనేని సుధాకర్ రావు మాట్లడుతూ రైస్ మిల్లులకు సరఫరా చేస్తున్న రబీ ధాన్యం బాయిల్డ్ రైస్ కు మాత్రమే అనుకూలంగా ఉండటం, అధిక నూకలు,డ్యామేజ్, ధాన్యం పొందే బాయిల్డ్ రైస్ నిల్వల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.

కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లర్లు ఖరీఫ్- రబీ ధాన్యం సేకరణ, మిల్లింగ్ డెలివరీ ప్రభుత్వ కార్యక్రమాలకు పీడీఎస్ రైస్ కు నిరంతరం సహకరిస్తున్నామని, అయితే ప్రస్తుతం పలు ప్రాయోజిత సమస్యల మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు





ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన మార్గం చూపాలన్నారు.

రబీ సీజన్ 2025-26లో వచ్చిన ధాన్యంలో అధిక భాగం బాయిల్డ్ రైస్ కు రా రైస్ అనుకూలంగా ఉందని, రా రైస్ మిల్లింగ్ చేసినప్పుడు బ్రొకెన్ రైస్ అధికంగా వస్తున్నందున నిర్దేశిత నాణ్యత, రికవరీ సాదించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి తగిన బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించి, వాస్తవ మిల్లింగ్ రికవరీకి అనుగుణంగా ఓటీఅర్ నిర్ణయించాలని కోరారు.

సీఎంఆర్ టీఆర్ ఐ వాస్తవ మిల్లింగ్గ్ రికవరీ ఆధారంగా శాస్త్రీయంగా ఓటీఆర్ నిర్వహించాలన్నారు. అలాగే 67 శాతం ఓటీఆర్ ర్ రాక చాల రా రైస్ మిల్లులు డిఫాల్ట్ అయినాయని, వారిని మానవతా దృష్టితో ఓటిఎస్ ఇన్ టైమ్ నిర్వహించాలన్నారు.

పెండింగ్ ధాన్యం, కొత్త ఖరీఫ్ పంట ప్రస్తుతం సుమారు 2.5 లక్షల ఎంటీ 1 లక్ష ఖరీఫ్ ధాన్యం పెండింగ్లో ఉందని, పాత ధాన్యానికి సంబంధించిన లెక్కలు, మిల్లింగ్ సీఎంఆర్ డెలివరీలు పూర్తిగా పరిష్కరించిన తర్వాతే కొత్త ఖరీఫ్ ధాన్యాన్ని అమలులోకి తీసుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. అప్పటి వరకు రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం ఎఫ్ సీఐ గోదాముల్లో నిల్వ చేయాలన్నారు.

ఎఫ్సి ఐ నిల్వ సీఎంఆర్ లిఫ్టింగ్ గోదాముల్లో తగిన నిల్వ స్థలం కల్పించి, సకాలంలో లిఫ్ట్ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యానికి పొడిగించి అధిక వర్షాల కారణంగా ధాన్యం దెబ్బత్తిన్న నేపథ్యంలో మిల్లింగ్

సీఎంఆర్ డెలివరీకి అదనపు సమయం అవసరం ఉందని, నవంబర్ వరకు, అవసరమైతే డిసెంబర్ వరకు పొడిగించాలని కోరారు. ఇచ్చిన పక్షంలో మిల్లర్లు తమ వద్ద ఉన్న ధాన్యానికి ప్రతి గింజకు బాధ్యత వహించి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యాన్ని పూర్తిగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

తమ సమస్యలను పరిశీలించి, జిల్లా అధికారులతో పాటు రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

రైతుల ప్రయోజనాలకు, ప్రభుత్వ ధాన్యం సేకరణ సిఎంఆర్ వ్యవస్థకు రైస్ మిల్లర్లు ఎల్లప్పుడూ సహకరిస్తామన్నారు. వెంటనే తమ సమస్యలను సానుకూలంగా స్పందించి తగిన ఆదేశాలు జారీ చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొనగిరి శషికిరణ్, కొశాధికారి గిరిధర్ లాల్ దొడియా, కరుణాకర్ తదితరులు పాల్గోన్నారు.

# మగ్గంపై అద్భుత సృష్టి.. పట్టుచీరపై కన్యకా పరమేశ్వరి దివ్య చరిత్ర!

**102 మంది ఋషుల పేర్లు..**

**102 గోత్రనామాలు..**

**25 చారిత్రక చిత్రాలు**

**45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై అరుదైన ఆధ్యాత్మిక కళాఖండం**

**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సిరిసిల్ల:చేనేత మగ్గంపై సంప్రదాయ కళకు ఆధ్యాత్మికతను జోడిస్తూ ఓ అద్భుతమైన పట్టుచీరను సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ రూపొందించారు. గుంటూరుకు చెందిన రత్నకుమారి--కోటేశ్వరరావు ఇచ్చిన ప్రత్యేక ఆర్డర్ మేరకు సుమారు 45 రోజులపాటు నిరంతర శ్రమించి, చేనేత మగ్గంపై కన్యకా పరమేశ్వరి అమ్మవారి దివ్య చరిత్రను చిత్రాలు, గోత్రనామాలు, ఋషుల పేర్లతో పట్టుచీరపై ఆవిష్కరించడం విశేషంగా నిలిచింది.

ఈ ప్రత్యేక చీరలో 102 మంది ఋషుల పేర్లు, 102 గోత్రనామాలు, కన్యకా పరమేశ్వరి అమ్మవారి చరిత్రను ప్రతిబింబించే 25 చిత్రాలను కళాత్మకంగా మలిచి నేయడం జరిగింది. ఒక్కో అంశాన్ని అత్యంత నైపుణ్యంతో మగ్గంపై పొందుపరుస్తూ, చేనేత కళాకారుడి సృజనాత్మకతకు అద్దం పట్టేలా ఈ చీరను రూపొందించారు.

ఈ అరుదైన కళాఖండాన్ని పూర్తిగా





పట్టుదారంతో, 2 గ్రాముల బంగారు జరి ఉపయోగించి నేశారు. సుమారు ఏడు మీటర్ల నర పొడవుతో రూపొందించిన ఈ పట్టుచీరలో భక్తి, చరిత్ర, కళ, చేనేత నైపుణ్యం సమ్మిళితమై కనిపిస్తాయి.

సాధారణంగా ఒక చీరను నేయడం ఒక కళ అయితే.. చరిత్రను చిత్రాల రూపంలో, గోత్రాలను అక్షరాల రూపంలో, ఆధ్యాత్మిక భావనలను పట్టుదారంతో మగ్గంపై మలచడం మరింత అరుదైన కళ అని చెప్పవచ్చు. ఈ చీర తయారీలో ప్రతి దశలోనూ ఎంతో ఓర్పు, ఏకాగ్రత, నైపుణ్యం అవసరమైంది.

కన్యకా పరమేశ్వరి అమ్మవారి దివ్య చరిత్రను భావితరాలకు చేనేత కళారూపంలో అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ చీర చేనేత కళకు, ఆధ్యాత్మిక విశ్వాసానికి, భారతీయ సంస్కృతి--సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అరుదైన కళాఖండంగా ఆకట్టుకుంటోంది.

గుంటూరుకు చెందిన రత్నకుమారి--కోటేశ్వరరావు ప్రత్యేకంగా ఇచ్చిన ఆర్డర్ను స్వీకరించి, దాదాపు 45 రోజులపాటు శ్రమించి మగ్గంపై ఈ అద్భుతమైన పట్టుచీరను రూపొందించడం చేనేత రంగంలో మరో విశేషంగా నిలిచింది.

# జర్నలిస్టుల జేపీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియామకం

## ఉత్తర్వులు జారీ చేసిన జేపీసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ముత్యాల రమేష్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ తోగరి కరుణాకర్కు ముత్యాల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ముత్యాల రమేష్ పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులే వారధులు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కె. శ్రీనివాసరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ జిల్లాలోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై కథారచన, నినాదాల రచన, పోస్టర్ మేకింగ్, స్కిట్, రీల్ మేకింగ్, ఫోటోగ్రఫీ, క్విజ్, డిబేట్, పేపర్ క్రాఫ్ట్ తదితర పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. విద్యతోపాటు సాహిత్య, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించడం ద్వారా విద్యార్థుల్లో ఉన్నతమైన వ్యక్తిత్వ విలువలు పెంపొందుతాయని అన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు సి. జగదీశ్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న నేపథ్యంలో ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ జి. సునీత, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్నమంజుల, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. లక్ష్మీ నీలిమ, ఎన్సీసీ అధికారి డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, రంగస్థల కళాకారుడు బాపనపల్లి వెంకటస్వామి, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు ఏకతాటిపై నిలవాలి

**'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి**

**ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు తాటిపల్లి శివకుమార్**



**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** ఆర్యవైశ్యుల ఐక్యతను చాటడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఆత్మగౌరవాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ నెల 13న నిర్వహించ నున్న ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం ('చలో హైదరాబాద్') కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తాటిపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నెక్కొండలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తాటిపల్లి శివకుమార్ ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. సంఘటిత శక్తితోనే సామాజికంగా ఎదురయ్యే సమస్యలను సమర్థంగా పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సభ్యులంతా అంతర్గత విభేదాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపై నిలిచి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనం ఆర్యవైశ్యుల ఐక్యతకు గొప్ప వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మండలంలోని ఆర్యవైశ్య సభ్యులు కుటుంబ సమేతంగా తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రకటనలో మండల కార్యదర్శి భూపతి వీరన్న, కోశాధికారి ఇమ్మడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛ అబ్దుల్లాపూర్ దిశగా అడుగులు...

**ప్రతి ఇంటికీ తడి,పొడి చెత్త డబ్బాల పంపిణీ...**




**లోకేశ్వరం, సెప్టెంబర్ 11 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామాన్ని సంపూర్ణ పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇంటింటి నుంచి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేర్వేరుగా స్వీకరించే విధానంపై గ్రామస్తులకు విస్తృతమైన అవగాహన కల్పించారు.

గ్రామంలో వ్యర్థాల విభజనకు సంబంధించి పంచాయతీ సిబ్బంది స్పష్టమైన మార్గదర్శకాలు అందజేశారు.ఆహార పదార్థాల అవశేషాలు, కూరగాయలు,పండ్ల వ్యర్థాలను తడి చెత్తగా ప్లాస్టిక్,గాజు,లోహ వస్తువులను పొడి చెత్తగా వేరు చేయాలని సూచించారు.అలాగే శానిటరీ వ్యర్థాలను ప్రత్యేకంగా నిల్వ చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా,నేరుగా పంచాయతీ సిబ్బందికి ఇవ్వడం ద్వారా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు.

పారిశుధ్య పరిరక్షణతోనే గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా భావించి పంచాయతీకి సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ దడిగే జయలలిత,ఉప సర్పంచ్ సాయినాథ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి,వార్డు సభ్యులు శ్రీకాంత్,లింగారెడ్డి,సాయినాథ్,సుదర్శన్‌లతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలి




**మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటుకోవాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరీంనగర్ అర్బన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫిట్ ఇండియా', 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి మెరుగైన అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మేయర్ పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.క్రీడలు కేవలం శారీరక వ్యాయామానికే పరిమితం కావని, వాటి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వం పెంపొందుతాయని అన్నారు. గెలుపోటములు ఆటలో సహజమని, అయితే ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతూ లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

"చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవచ్చు" అని మేయర్ అన్నారు.

వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం అందిస్తున్న కోటా గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ అంజిరెడ్డి కి మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏ కార్యక్రమమైనా విజయవంతం కావాలంటే అందరి సహకారం అవసరమని, విద్యా సంస్థలు క్రీడలను ప్రోత్సహించడంలో ముందుండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డీఈవోచైతన్య జైని ,కోటా గ్రూప్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ అంజిరెడ్డి,కార్పొరేటర్ గాజా శివరాం ,జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి బస్సీలాల్, అర్బన్ సెక్రటరీ శంకరయ్య, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ శ్రీనివాస్ , ఉపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**వరంగల్ ట్రాఫిక్ పోలీసుల సూచన.. తక్కువ జరిమానాతో కేసుల పరిష్కారానికి అవకాశం**




**వరంగల్, అక్షిత బ్యూరో;** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్ తదితర కేసుల్లో వాహనాలు సీజ్ అయిన వారు జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఈ నెల 12న శనివారం (రేపు) వరంగల్ రెండో తరగతి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత కేసుల్లో న్యాయస్థానానికి హాజరై, నిబంధనల ప్రకారం తక్కువ జరిమానాతో కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**ఇవి వెంట తీసుకురావాలి..**

డ్రంకెన్ డ్రైవ్ కేసులు: ఆధార్ కార్డు జిరాక్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు తీసుకురావాలి.

డ్రైవింగ్ లైసెన్సు కేసులు: ఆధార్ కార్డు, మీ సేవలో డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు తీసుకురావాలి.

మైనర్ డ్రైవింగ్ కేసులు: జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మెమో తదితర వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలి.

పోలీసుల అధీనంలో ఉన్న వాహనాలకూ అవకాశం

2020 నుంచి 2024 మధ్య కాలంలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్సు లేకపోవడం, పెండింగ్ చలాన్లు లేదా ఇతర కారణాలతో వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడి, ప్రస్తుతం పోలీసుల అధీనంలో ఉన్న ద్విచక్ర వాహనాల యజమానులు కూడా తమ వాహనానికి సంబంధించిన సరైన పత్రాలతో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి వాహనాలను తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు.

కేసులు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఈ నెంబర్ లలో సంప్రదించవచ్చు. 8712685108, 8712544416

# బిఆర్ఎస్, బిజెపి రెండు కూడా దళిత వ్యతిరేక పార్టీలే...

**బిఆర్ఎస్‌కు దళితుల పట్ల చిన్న చూపు ఉంది..**

**వారి ప్రభుత్వ హయాంలో దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..**

**బిజెపి రామ్ లీలా మైదానాన్ని శుద్ధి చేయడం వారి దళిత వ్యతిరేకతకు నిదర్శనం..**

**సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి దళితులను ఎందుకు ఆహ్వానించలేదు..**

**ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది..**

**కెసిఆర్‌కు అన్ని విషయాలపై అవగాహన ఉంది..**

**కానీ ఆయన ఫామ్ హౌస్‌కి పరిమితమయ్యారు..**



**జగిత్యాల అక్షిత ప్రతినిధి- సెప్టెంబర్ 11:** దేశంలోనూ మరియు రాష్ట్రంలోనూ దళితులపై వ్యతిరేక ధోరణి కొనసాగుతుంది...

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మల్లికార్జున్ ఖర్గే రామ్ లీలా మైదానంలో సమావేశం తర్వాత ఆ స్థలాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం, బిఆర్ఎస్ పార్టీ దళిత స్పీకర్ను అవమానించడం, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ ను పసుపులతో శుద్ధి చేయడం ఇవన్నీ వారి దళిత వ్యతిరేక ధోరణికి నిదర్శనం... రెండు పార్టీలు.. దళితుల పట్ల తమ పైశాచిక ఆనందాన్ని ప్రదర్శిస్తున్నారు. గత దశాబ్ద కాలంగా రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ పార్టీకి ప్రజా సమస్యలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదు.. అసెంబ్లీ సమావేశాలలో ప్రశ్నించకుండా సభ సమయాన్ని వృధా చేస్తున్నారు... కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.. మహిళా కానిస్టేబుల్ ల పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరు బాధాకరం..

**నేరెళ్ల బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..**

బిఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇసుక లారీలను అడ్డుకున్నందుకు కేటీఆర్ నియోజకవర్గ అయినా నేరెళ్లలో దళిత సోదరులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..

**పేరుకు మాత్రమే అంబేద్కర్ సచివాలయం...**

సచివాలయం కు పేరు మాత్రమే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం అని పెట్టారు. కానీ అగ్రవర్ణాల వారితో మాత్రమే అక్కడ పూజా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.. కానీ.దళితుల, గిరిజనులను ను ఆహ్వానించలేదు.. పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహాన్ని కూడా జిహెచ్ఎంసి వాహనాల్లో తరలించారు..

**ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బిఆర్ఎస్ విఫలమైంది..**

బి ఆర్ ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను చూసి ఈర్ష పడుతుంది.. ప్రతిపక్ష పాత్ర పోషించడంలో పూర్తిగా విఫలమైంది.. ప్రభుత్వ పథకాలలో ఏమైనా లోపాలు ఉంటే ఎత్తిచూపాల్సిన ప్రతిపక్ష పార్టీ తమ వైఫల్యాలను తప్పిపుచ్చుకోవడానికి అసెంబ్లీ సమావేశాలు జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎండగడుతుందని దురుద్దేశంతో సభ నడవకుండా బి ఆర్ ఎస్ ప్రయత్నించింది.. అందులో భాగంగానే స్పీకర్ వాళ్ళ అమ్మను అవమానించారు.. పోలీసులను బిఆర్ఎస్ నాయకులు దుర్భాషలాడారు, దాడులకు పాల్పడ్డారు.

**కెసిఆర్‌కు అన్ని విషయాలపై అవగాహన ఉంది..**

ఉద్యమ నాయకుడిగా కెసిఆర్ కు రాష్ట్రం పై పూర్తిస్థాయి అవగాహన ఉంది.. రేవంత్ రెడ్డి లాంటి యువ నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లడంలో ఆయన విలువైన సూచనలు చేయవచ్చు..

కానీ ఆయన వారి సంబంధికులకు ఏమైనా జరిగితేనో చనిపోతే మాత్రమే బయటకు వస్తున్నారు.. ఆయనకు అనుభవంతో మంచి సూచనలు ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోవచ్చు ప్రతిపక్ష నాయకుడిగా తన పాత్ర పోషించవచ్చు కానీ అలా చేయకుండా కేవలం ఫామ్ హౌస్ కు మాత్రమే పరిమితం అవుతున్నారు అని అన్నారు...

# ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేసిన భాజపా నాయకులు




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మండల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల తహసిల్దార్ కి సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవంను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించడం, సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ ఇన్ తెలంగాణ, హైదరాబాద్ - తెలంగాణ విమోచన మ్యూజియాన్ని ఏర్పాటు చేయుట, ప్రతి జిల్లా కేంద్రాల్లో తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం ఏర్పాటు, పాఠ్యపుస్తకాలలో తెలంగాణ విమోచన చరిత్ర - అజ్ఞాతవీరుల అధికార జాబితా, రజాకార్ల దురాగతాలకు బలైన గ్రామాలలో విమోచన స్మారక స్తూపాలు, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు వంటి సప్త కార్యక్రమాలు తెలంగాణలో ఏర్పాటు చేయాలని వినతి పత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దూడల బిక్షం గౌడ్, భువనం మధుసూదన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, చినుకని మల్లేశం యాదవ్, అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్ గౌడ్, కట్ట కృష్ణ, కడారి ఐలయ్య, దిండు భాస్కర్, బోయ సదానందం, బాతరాజు ధనుంజయ,మునగాల అమరేందర్ రెడ్డి, అల్మాస్పేట గౌతమ్, లగోని పాండు గౌడ్, కొయ్యడ స్వామి గౌడ్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అందరి పిల్లల్లాగే వారూ ఎదగాలి

**రెడ్లవాడ బడిలో వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉచిత యంత్రాలు**

**లోపాలు ఉన్న పిల్లలను బడికి పంపాలన్న హెడ్‌మాస్టర్ సురేష్**




**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** అంగవైకల్యం ఉన్న పిల్లలను వేరుగా చూడకుండా, మామూలు పిల్లలతో పాటే కలిపి చదివించినప్పుడే వారు కూడా సమాజంలో బాగా ఎదుగుతారని రెడ్లవాడ జడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ బెజుగం సురేష్ అన్నారు. వినికిడి లోపం (చెవి సరిగా వినిపించని సమస్య) ఉన్న కొందరు విద్యార్థినులకు శుక్రవారం బడిలో ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకం 'సమగ్ర శిక్షా అభియాన్' కింద వీటిని అందజేశారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ మాట్లాడుతూ.. శరీరంలో ఏదైనా లోపం ఉంటే అది పిల్లల చదువుకు అడ్డం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటి యంత్రాలను ఉచితంగా ఇస్తోందని చెప్పారు. వీటి సాయంతో పిల్లలు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. లోపాలు ఉన్న పిల్లలను అందరితో కలిపి చదివిస్తే వారిలో ధైర్యం, నమ్మకం పెరుగుతాయని, ఆ బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే అని ఆయన చెప్పారు. అంజయ్య (ఐఈడీ అధికారి) మాట్లాడుతూ.. శారీరక, మానసిక లోపాలు ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి, వారికి తగ్గట్టుగా చదువు చెప్పడంతో పాటు ఇలాంటి పరికరాలు కూడా ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. దయచేసి అలాంటి పిల్లలను ఇళ్లలో ఉంచకుండా తప్పకుండా బడుల్లో చేర్పించాలని ఆయన అమ్మానాన్నలను కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ దేవేందర్, బడి ఉపాధ్యాయులు, పిల్లలు, వాళ్ల అమ్మానాన్నలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవంకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**మట్టి వినాయకులను పూజిస్తే పర్యావరణ పరిరక్షణ**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల అక్షిత ప్రతినిధి:** సెప్టెంబర్ 17 2026 న ప్రజా పాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పక్కడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన దినోత్సవం ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వానాలు, జాతీయ పతాకావిష్కరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోనే కార్యక్రమం నిర్వహిస్తున్నందున టెంట్లు, భారీకేడ్ల ఏర్పాటుతోపాటు స్టేజి అలంకరణ, శుభ్రత, తాగునీరు, ఫైర్ సేఫ్టీ, వైద్య శిబిరం, తదితర ఇతర సౌకర్యాలు ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 17.2026 ప్రాధాన్యతను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పురపాలికలు, మండలాల్లోనూ ప్రజా పాలన దినోత్సవంను జరపాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన విగ్రహాలతో కాలుష్యం పెరుగుతుందని, పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

ముఖ్యంగా అధికారులందరూ మట్టి గణనాథులను పూజించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా అవసరమైన ఏర్పాట్లన్ని చేయాలన్నారు.

ఈ సందర్భంగా మట్టి వినాయకుల ప్రాధాన్యతపై ముద్రించిన గోడపత్రికలను, విగ్రహాలను ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

పలువురు అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
శనివారం | 12| సెప్టెంబర్| 2026

## తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దు

### పటేల్ సైనిక చర్య వల్ల కాదు

### ఎల్లంకి మహేష్ మండల సహాయ కార్యదర్శి




**వలిగొండ/అక్షిత న్యూస్:** వలిగొండ మండల కేంద్రంలోని వేములకొండ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ పులిపలుపుల రామ లక్ష్మయ్య, కేశిరెడ్డి అనంతరెడ్డి, నీలం చెన్నయ్య, కాడిగళ్ళ సాయిలు, ఎం.డి ఖాజామైనుద్దీన్ ల అమరవీరుల స్థూపానికి పూలమల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ ఆనాటి నిజాం నిరంకుశ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టులు సెప్టెంబర్ 11 న సాయుధ పోరాటనికి రావి నారాయణరెడ్డి ,బద్దం ఎల్లారెడ్డి , మాగ్దుమ్ మోహినుద్దీన్ లు పోరాటానికి పిలుపునిచ్చారు ఈ పోరాటంలో నాలుగు వేల మంది మృత వీరులు నేలకువరిగారు. ఆనాటి నిజాం నిరంకుశ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం.. మట్టి మనుషులు నడిపిన మహత్తర పోరాటం...తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన కమ్యూనిస్టులని 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ భారత్లో విలీనం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహ చారి, గ్రామ శాఖ కార్యదర్శి పులి పల్పుల మల్లేశం, తాలూకా యాదగిరి, చంద్రగిరి చంద్రయ్య, బుంగ చక్రపాణి, తాలూకా నర్సమ్మ, కాడిగళ్ల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోషక విలువలు కలిగిన ఆహారంతో సుఖ ప్రసవం

### ఐ సి డి ఎస్ సి డి పి ఓ సత్యవతి




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** గర్భిణీలు పోషక విలువ కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత సమస్యలు లేకుండా సుఖ ప్రసవం అవుతారని సిడిపిఓ సత్యవతి అన్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని కిష్టారం 6 అంగన్వాడి కేంద్రంలో టీచర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాస ఉత్సవాలలో సత్యవతి మాట్లాడుతూ గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకున్నట్లయితే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. కిష్టారం సెక్టార్ సూపర్వైజర్ రజిని మాట్లాడుతూవ్యక్తిగతపరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. పరిశుభ్రత వలన వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. చిన్నారులను ప్రైవేటు పాఠశాలకు వ్యానులు ఎక్కించి పంపించ వద్దన్నారు. స్థానికంగా అంగన్వాడి కేంద్రాలకు పంపించి బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన అదనపు ఆహారాన్ని ప్రదర్శించి తయారు చేసే విధానాన్ని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాంబాబు,ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ హైదరాబాద్‌లో కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక శిక్షణ

### వృత్తి నిపుణుల కోసం నాలుగు వారాల ధ్రువీకరణ కార్యక్రమం




**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** కృత్రిమ మేధస్సు రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలనుకునే వృత్తి నిపుణులకు భారతీయ సాంకేతిక విద్యాసంస్థ హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్) శుభవార్త అందించింది. వాస్తవ ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు ఆధారిత అనువర్తనాలను రూపొందించడం, అమలు చేయడంపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు నాలుగు వారాల ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనువర్తిత కృత్రిమ మేధస్సు వృత్తి నిపుణుల ధ్రువీకరణ కార్యక్రమం--సెప్టెంబర్ 2026' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమం సెప్టెంబర్ 19న ప్రారంభమై అక్టోబర్ 17 వరకు కొనసాగనుంది. కృత్రిమ మేధస్సు ఆధారంగా పనిచేసే స్వయం నిర్వహిత వ్యవస్థల రూపకల్పన నుంచి వాటి అమలు, పనితీరు పరిశీలన వరకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందులో అందించనున్నారు. వృత్తి నిపుణులకు ఉద్యోగ విధులకు ఇబ్బంది కలగకుండా శిక్షణ పొందేలా కార్యక్రమాన్ని మిశ్రమ విధానంలో రూపొందించారు. ప్రతి శనివారం బోధకుల ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించనుండగా, ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో నేరుగా లేదా అంతర్జాలం ద్వారా పాల్గొనే అవకాశం కల్పించారు. వారంలో మిగిలిన రోజుల్లో మార్గదర్శకత్వంతో కూడిన అభ్యాసం, ప్రాయోగిక పనులు, ప్రాజెక్టు రూపకల్పన, నిపుణుల సలహాలు అందించనున్నారు. శిక్షణలో భాగంగా పాల్గొనేవారు ప్రతి వారం కొత్తగా నేర్చుకున్న అంశాలను ప్రాజెక్టులో అన్వయించుకోవాల్సి ఉంటుంది. తద్వారా కేవలం సిద్ధాంత పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, వాస్తవ ప్రపంచంలో ఉపయోగించగల కృత్రిమ మేధస్సు ఆధారిత అనువర్తనాన్ని క్రమంగా అభివృద్ధి చేసే అవకాశం లభిస్తుంది. సమాచారాన్ని సేకరించి సమాధానాలు రూపొందించే విధానాలు, సాధనాల వినియోగం, జ్ఞాపక వ్యవస్థలు, వివిధ కృత్రిమ మేధస్సు వ్యవస్థల సమన్వయం, బహుళ స్వయం నిర్వహిత వ్యవస్థలు, పనితీరు అంచనా, వ్యవస్థల పర్యవేక్షణ, భద్రతా నియంత్రణలు, అమలు విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. నమ్మకమైన కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలను రూపొందించేందుకు అవసరమైన పూర్తి ప్రక్రియను పరిచయం చేయడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

ఐఐటీ హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ప్రవీణ్ తమ్మన, డాక్టర్ ఆశిష్ మిశ్రా, డాక్టర్ అనుపమ్ సంఘితో పాటు కృత్రిమ మేధస్సు పరిష్కారాల నిపుణుడు ఎన్.వి.ఎస్.ఎస్. కౌండిన్య శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా పాల్గొనేవారు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించి, వాటిపై నిపుణుల అభిప్రాయాలు పొందే అవకాశం ఉంటుంది. నిర్దేశిత శిక్షణ, పనులు, మూల్యాంకనాలను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో వృత్తి నిపుణుల ధ్రువీకరణ పత్రం అందజేయనున్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

### జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** ఈ నెల 14వ తేదీన సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖకు సంబంధించిన అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీస్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వినాయక విగ్రహాల ఏర్పాటు కోసం పోలీస్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత పోలీస్ స్టేషన్ వివరాలు, విగ్రహం ఏర్పాటు చేసే తేదీ, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జనానికి వినియోగించే వాహనం వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలు తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రతి గణపతి మండప నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

వినాయక నవరాత్రుల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా, పోలీస్ శాఖ నిబంధనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి.జానకి సూచించారు.

ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా అందుబాటులో ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### అప్పలరావుపేటలో 'పోషణ్ అభియాన్' మాసోత్సవం

### సమిష్టి కృషితోనే పోషకాహార లోప నిర్మూలన




**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించడం ద్వారానే వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్ అన్నారు. నెక్కొండ మండలం అప్పలరావుపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన "పోషణ్ అభియాన్" మాసోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, పండ్లు, ఐరన్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. కిశోర బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. శారీరక, మానసిక వికాసానికి సమతుల ఆహారం కీలకమని, విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి ఇంట్లో వండే పౌష్టికాహారాన్నే తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోప సమస్యలను పారదోలే బాధ్యత కేవలం ఐసీడీఎస్, అంగన్వాడీ కేంద్రాలకే పరిమితం కాదని, ఆరోగ్యవంతమైన సమాజ రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అప్పలరావుపేట అంగన్వాడీ టీచర్లు మహేశ్వరి, సుజాత, హెల్త్ అసిస్టెంట్ సరోజన, ఆయాలు వెంకటలక్ష్మి, రమాదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, నూరజ్, శ్రీనివాసాచారి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.